ఓంశ్రీసాయిరాం

సత్యంబునుండి సర్వంబు సృష్టించె
సత్యమందణగెను సర్వసృష్టి
సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరయ్య.

ప్రేమస్వరూపులారా!

నేటి ఉదయం హైదరాబాద్‌నుండి వచ్చిన భక్తులు మృదుమధురంగా శ్రవణానందమునందించారు. కేవలము శ్రవణానందమే కాకుండా మననాదందము కూడా కలిగింది. ప్రేమకు మించిన పదార్థము మరొకటి లేదు. ఇట్టి ప్రేమను గురించి ఎవరెన్ని చెప్పిననూ తక్కువే అవుతుందిగానీ దీనికి మించినది కాలేదు. ప్రేమలేని మానవుడు, ప్రేమ లేని జీవుడు జగత్తులో కానరాడు. దేని స్థాయికి తగిన బరువు ఆ స్థాయికి తగినట్టుగా ఉంటుంది. ముఖ్యముగా ప్రేమ యిట్టిది అట్టిది అని ఎవ్వరూ చెప్పలేరు. 'చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమమీర వెలసియుండే బిరుదు వహించిన రామా నన్ను బ్రోవరా' అన్నాడు త్యాగరాజు. చీమ రూపము యెట్టిది, బ్రహ్మ రూపు యెట్టిది అని విచారిస్తూపోతే బ్రహ్మము అఖండజ్యోతివలె వెలుగుతూ ఉన్నది. చీమ అత్యంత స్వల్పమైన రూపాన్ని ధరించి తిరుగుతున్నాది. ఈవిధముగా ఒకదానికొకటి పోల్చి చూచిన పోలికయే చేరదు.

ఒకానొకసమయంలో ఎలుగుబంటుకు ఆకలి వేసింది. ఆ ఎలుగుబంటు చీమల పుట్టల దగ్గరకు వచ్చి, 'నాకు ఆకలి వేస్తున్నాది. నేను యింక భరించుకోలేను. నాకేమైనా మీరు దాచి ఉంచిన ఆహారము యేమైనా వుంటే నాకిచ్చి నా ఆకలి తీర్చండి' అని అడిగింది. చీమకు నవ్వు వచ్చింది. 'నీవు ఎక్కడ? నేను ఎక్కడ? నీ స్వరూపమునకు సరిపోయే ఆహారము నా దగ్గర లేదే! ఆహారానిన స్వల్పంగా తీసి పెట్టుకుంటున్నాను అంతే తప్ప నిన్ను పోషించే శక్తి నాకు లేదు' అంది. కానీ, ఆరు నెలల తమ భవిష్యత్తుకు తగిన ఆహారాన్ని కూడబెట్టుకోటం చీమల సహజం. చీమ లోపలికి వెళ్ళింది. కావలసినంత ఆహారాన్ని తన వేగుల ద్వారా తెప్పించి పైకి అందించింది. అప్పుడు ఈ ఎలుగుబంటుకు ఆశ్చర్యం వేసింది. 'ఇంత చిన్న చీమ యింత ఆహారాన్ని యేవిధంగా కూడబెట్టుకున్నది? ఇది ఆశ్చర్యకరంగా ఉంటున్నాది' అని ఆశ్చర్యపడింది. కూడబెట్టుకొనవలెనని ఆశకలిగిన ఎటువంటి చిన్నదైనా దానిని కూడబెట్టుకుంటుంది. ఈనాటి మానవుడు, అఖండ తెలివితేటలుగల మానవుడు ఆనాటి తన తిండి తాను కూడబెట్టుకోలేక పోతున్నాడు. దీనికి ఆశ్చర్య పడనక్కరలేదు. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. భగవంతుడు అందించిన ఆహారమును అంతో ఇంతో తిని దానిలోని భాగములను కూడబెట్టుకొని పోషిస్తూ వస్తున్నాము. ఈ తెలివితేటలు చీమ ద్వారా మానవుడు గుర్తించుకోగలుగుతున్నాడు. ఇంత తెలివిగలిగిన చీమ, యింత ఆహారము కూడబెట్టుకొని, యింత భుజించి, కొంత మిత్రులకు పెట్టి తాను యింకా దాచిపెట్టుకో గలుగుతున్నాది. జగత్తులో వెదకి చూచిన మానువునికంటె తెలివితేటలు గలవాడు కానరడు. కాని, అట్టి మానవుడు తన తెలివితేటలను అధికంగా పెంచుకొనలేకపోతున్నాడు. దాచిపెట్టి, దాచి పెట్టినది పదిమందికి అందించటం అనే తెలివితేటలు చీమయందు మాత్రమే ఉంటున్నది. ఈవిధంగా మనము యోచనచేస్తూ జగత్తులో చూసినప్పుడు యెంతయో గొప్ప తెలివితేటలు మానవునియందు ఉంటున్నవి. ఇట్టి తెలివితేయలుండి కూడా మానవుడు అల్పుడై తిరుగుతున్నాడు. స్వార్థస్వప్రయోజనములు అధికంగా పెంచుకోటం చేత మానవుడు హీనస్థితికి దిగజారిపోతున్నాడు. మానవునకు జగత్తులో యేమి తక్కువ? అన్నీ ఉన్నవిగానీ ఎప్పుడు ఉపయోగపెట్టుకోవలి అనే విధివిధానము గుర్తించుకోలేకపోతున్నాడు. ఈ మానవత్వములో వుండిన అల్పమైన గుణములను అధికము చేసుకొన లేకపోతున్నాడు మానవుడు.

ప్రేమస్వరూపులారా! ప్రేమకు మించిన పదార్థము, ప్రేమకు మించిన శక్తి యెక్కడ చూచినా లేదు. ఎక్కడ చూచినా ప్రేమ ఒక్కటి మాత్రమే గొప్పశక్తిగా కనిపిస్తున్నాది. ప్రేమ యింటి దగ్గరనున్న తోటమాలితో చేరి అందరినీ కాపాడుతూ వస్తుంటాది. ఈవిధంగా తాను కాపాడుకుంటూ పోవటం వలన ఎంతైనా త్యాగము చేసి తాను పరిశుద్ధముగా ఉంటాడు. మానవునకు స్వార్థము, స్వప్రయోజనము మితిమీరిపోవటం చేత యీ తెలివితేటలు గతి తప్పి దారితప్పిపోతున్నవి. ఈ స్వార్థమును మనం దూరం చేసినప్పుడే మనలోనున్న యే చిన్న శక్తియైనా గొప్పశక్తిగా రూపొందుతుంది. కనుక, మనయందున్న చిన్న తెలివిని ఘనంగా మార్చుకోవచ్చును. మానవునికి తెలివితేటలు తక్కువ కాలేదు. మానవునకు కావలసినంత తెలివితేటలు, శక్తి అధికముగానే ఉంటున్నాయి. ఇంత ఉండికూడను యేవిధంగా దాన్ని కాపాడుకోవాలి, యేవిధంగా దాన్ని దాచుకోవాలి, యేవిధంగా దాన్ని ఉపయోగించుకోవాలి అనే విధివిధానము గుర్తించటానికి యేమాత్రమూ ప్రయత్నించటం లేదు.

ప్రేమస్వరూపులారా! ఈనాటి విద్యార్థులు ఎన్నియో పాఠములు చదువుతున్నారు. ఆ విద్యార్థులు చదవని పుస్తకములే కనిపించటం లేదు. 'పుస్తకములనిండ మస్తుగ చదువుడె, మస్తకమునిండ మట్టి మెండు'. అనగా ఉపయోగములేని విషయములను తన తలలో చేర్చుకుంటున్నాడు. మానవుడు జీవితమునకు అవసరమైన శక్తిని తాను దుర్వినియోగము చేస్తున్నాడు. మానవునికి శక్తి, చదువు తనయొక్క ఉపయోగమునకే యిచ్చాడు. 'చదువు, చదువు చదివి చావంగనేటికి, చావులేని చదువు చదవ వలయు'. కనుక, మనము చావు లేని చదువు చదువుకోవాలి. ఎవరు అడిగితే దానికి తగిన రీతిగా జవాబు చెప్పే బుద్ధిని నేర్చుకున్నారుగానీ తగిన సమయంలో ఉపయోగపెట్టుటకు తగిన ప్రయత్నం చేయటం లేదు. ఈ చదువులు చదివి కడపటికి తన చదువు ఏవిధంగా ఉపయోగిస్తున్నాడు? నిత్యజీవితంలో పరులకు సద్వినియోగ పరచే రీతిలో దీనిని వినియోగించుకోవాలి. లోకములో మానవులకు యిచ్చిన సంపదలన్నీ పరులకు ఉపయోగించుకునే నిమిత్తమై అందించాడేగాని స్వార్థస్వప్రయోజన నిమిత్తమై కాదు. 'పరోపకారార్థం యిదం శరీరం' శరీరము యిచ్చినది తిని, తిరగటంకోసం కాదు. తిరిగి తెలివితేటలను పంచుకొని, వాటిని సద్వినియోగపరచి మానవత్వాన్ని బయటకు తెప్పించుకోటానికి యిచ్చాడు. కనుక, మనము చదివే చదువులుగానీ, తెలుసుకున్న తెలివితేటలుగానీ మన నిమిత్తము కాదు. సమాజముయొక్క సద్వినియోగమునకై, సమాజమునకు తోడ్పడుటకు ఈ తెలివితేటలను ఉపయోగించాలి. ఈసత్యాన్ని విసర్జించి, ఏదో కొత్తది తెలుసుకున్నానని తాను ముందుకు వచ్చి అనేకవిధములుగా పాటుపడుతున్నాడు. మానత్వమనగా యేమిటో తాను యింతవరకు అర్థము చేసుకోలేదు. అసలు మానవుడంటే యేమిటని అర్థము చేసుకోలేకపోతున్నాడు. మానవ మా అనగా మంచి తెలివితేటలు కలిగి, వ అనగా వాటిని తెలుసుకొనకుండా వ వర్తిస్తున్నాడు మానవుడు. మంచి తెలివిచేటలుండి కూడా వాటిని తెలుసుకోకుండా వర్తిస్తున్నాడు మానవుడు. కాన. మానవత్వముయొక్క దివ్యత్వము, పవిత్రము దైవత్వముయొక్క కీర్తినుంచే బయటకు తెప్పించుకోవాలి. ఏ చిన్నది మానవునినుండి వెలువడినప్పటికీ, ఏమిటిది, ఎందుకిది నా నుండి వచ్చినది అని దైవము యిచ్చిన ప్రసాదముగా భావించుకొని ఈ ప్రసాదముయొక్క విలువ చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఏ పదార్థము గానీ, ఏ తెలివితేటలుగానీ, ఏ బుద్ధికుశలతగానీ భగవంతుడు అందించేది లోకసంరక్షణ కోసమే, పరోపకారనిమిత్తమే. మనము ఉపయోగించుకొని, తద్వారా మానవత్వాన్ని మనము పెంచుకోవాలి. ఆవిధమైన మార్గాన్ని వదిలాడు మానవుడు. దానిని వదలి, దానికి విరుద్ధమైన మార్గాన్ని వెతుకుతూ చెడిపోతున్నాడు. ఒక పశువుకూడా మానవునకు ఎన్నియో సేవలు చేసి తన పొట్ట నింపుకొని

మానవునకు తగిన ఆనందము అందిస్తున్నాది. ఈమాత్రము మానవుడు గుర్తించుకోలేకపోవటం చాలా పొరపాటు. 'మానవత్వము చేరి మంచినే బోధించు, తెలిసి మెలగవలయు తెలివితోడ'. మానవత్వము లేకుండా, దానవత్వమును పెంచుకొని దీనత్వములో దిగిపోతున్నాడు. సమష్ఠి అనేది దైవత్వము. వ్యష్ఠి అనేది మానవత్వము. సమష్ఠి అనేదాన్ని మనం తెలుసుకున్నప్పుడు వ్యష్ఠియొక్క తత్త్వము చక్కగా, సులభంగా అర్థమౌతుంది.

ప్రేమస్వరూపులారా! మీరు చదివిన చదువులు, తెలుసుకొన్న తెలివితేటలు ఉండినప్పటికీ మనము ఈనాడు పశుపక్షిమృగాదులనుండి నేర్చుకోవలసి వచ్చింది. ఇట్టి సత్యాన్ని టీచర్సు బోధించటానికి వీలుకాదు. ఆ టీచర్సుకూడా తాము తెలుసుకోకుండా తమలో దైవత్వాన్ని మర్చిపోతున్నారు. కనుక, మనము నేర్చుకున్నదంతా మన పొట్ట నింపుకోటంకోసంకాదు, పదిమందికి పంచి, వారిని ఆనందపరచి తద్వారా మానవత్వాన్ని దివ్యత్వంగా మార్చుకోవాలి. మానవత్వము సమత్వంతో ఉండాలి. ఈ సమత్వము పోయినప్పుడు మానవత్వము ఉండి యేమాత్రము ప్రయోజనము లేదు. కనుక, మొట్టమొదట మనం సమత్వాన్ని తీసుకోవాలి. ఈ సమత్వము మానవత్వములో లేకపోయినప్పుడు ఈ దివ్యత్వం ఉండికూడా ప్రయోజనం ఉండదు. దివ్యత్వమనగా ఏమిటి? దివ్యమైన శక్తితో కూడినది దివ్యత్వము. ఇదియే దైవశక్తి. ఈ దైవశక్తి ప్రతి మానవునియందు నిండినిబిడీకృతమై ఉన్నది. కానీ, దాన్ని అందుకోలేక అబలుడై వదలి పెడుతున్నాడు మానవుడు. కనుక, దైవత్వమును చక్కని భావములతో అభివృద్ధి పరచుకోవాలి. మానవత్వము ఎంతకాలమునుండియో పెరుగుతూ వస్తున్నాది. ఈనాటిది కాదు ఈ మానవత్వము. తల్లి గర్భమునుండి పుట్టిన తక్షణమే మానవుడు అని భావించుకోకూడదు. తల్లి గర్భమునుండి ఆకారము మాత్రము పుట్టిందిగాని మానవత్వమనేది సహజంగానే ఉంటున్నాది. ప్రతి మానవుని యందు ఈ దివ్యత్వము ఉన్నది. ఈ దివ్యత్వమును గుర్తించుకోలేకపోవటం చేతనే మానవత్వాన్ని కూడా మర్చిపోతున్నాడు. కనుక, మనము మానవత్వాన్ని మొట్టమొదట గుర్తించుకోవాలి. ఈనాడు మనము మానవత్వాన్ని తెలుసుకున్నామని అనుకుంటున్నాము కానీ యేమి తెలుసుకొన్నాము? మానవత్వమంటే కేవలము ఆకారమును మాత్రమే తెలుసుకోటం కాదు. ఈ ఆకారము తెలుసుకొన్నంత మాత్రమున ఆచరణ లేకపోతే ప్రయోజనమేమిటి? ఆచరణలో పెట్టాలి. అప్పుడే మానవత్వము సార్థకమౌతుంది. మానవత్వాన్ని సార్థకము గావించుకొనే నిమిత్తమై లోకములో ఇన్నివిధములైన శాస్త్రములు, ఉపనిషత్తులు వచ్చాయి. లేకపోతే ఈ శాస్త్రములు, ఉపనిషత్తులు ఎందుకు మనకు? అన్నీకూడా మానవునియందు దాచబడిన దైవత్వాన్ని బయటకు లాగుట కొసమే. అందుకే ఎడ్యుకేర్ అని చెప్పారు. ఎడ్యుకేషన్ అనగా సహజంగా వచ్చే స్వరూపము. ఎడ్యుకేర్ అనగా లోపల దాగినదాన్ని బయటకు లాగటం. చదివితే లభించేది ఎడ్యుకేషన్. చదివినది అప్పటికప్పుడు ఉపయోగపెట్టుకోవచ్చు. కానీ ఎడ్యుకేర్ అనేది మన రక్తముతో కూడినట్టు ఉంటుంటాది.

ప్రేమస్వరూపులారా! నేడు ప్రధానంగా తెలుసుకోవలసినది దైవత్వాన్ని.అడుగడుగునాకూడా, క్షణక్షణము మనకు కనిపిస్తునే ఉంది. దాన్ని మనం తెలుసుకోలేకపోతున్నాం. దానిని తెలుసుకున్నవాడే నిజమైన చదువరి. డివినిటీ లేకుండా ఎడ్యుకేర్ మనకు ప్రాప్తించదు. ఎడ్యుకేషన్ అంటే గ్రంతములను కంఠస్తము చేసుకొని చెప్పే పదములే. ఎడ్యుకేర్ అనేది మనయందు స్థిరముగా మొదటినుండి మనలోనుంచి పుడుతున్నాది. ఇది బయటకు తెప్పించేదే గొప్ప శక్తి. ఈ ఎడ్యుకేషన్ కేవలము మనం నేర్చుకున్నది. ఎడ్యుకేర్ అనేది మనలోనుండి ఆవిర్భవించేది. నిరంతరము అతనియందు కనిపిస్తూనే ఉంటుంది. ఇది గ్రంథములనుండి అందుకొనేది కాదు. ఎడ్యుకేర్ సహజమైనది. కనుక, మనము చదివే చదువులు చదివే చదువులు కేవలము గ్రంథపరిచయము మాత్రమే. ఈ ఇన్ఫర్మేషన్ తో లభించది యేమీ లేదు. ట్రాన్సఫర్మేషన్ కావాలి. అదిలేనప్పుడు ఇన్ఫర్మేషన్ తీసుకుంటే వేష్టు. ఈ వేష్టు చదువును మనము టేస్టుగా తీసుకుంటున్నాము. అదికాదు. నిజముగా ఎడ్యుకేర్

అనేది మనయందు ఆవిర్భవించుకుంటూ క్షణక్షణము మన వెంట జంట వస్తుంటుంది. మానవునియందున్న తెలివితేటలు, బుద్ధికుశలత దైవము యొక్క ప్రసాదములే. కనుక, దైవము యిచ్చిన శక్తిని దాచిపెట్టుకొని తగిన రీతిగా ఉపయోగపెట్టుకోవాలి. నిజముగా మనకు యిచ్చిన శక్తి ఎంతయో ఉంటున్నాది. ఇది యిట్టిది ,అట్టిది అని ఎవ్వరూ కొల్చి చెప్పలేరు. ఈ శక్తికి మించిన శక్తి మరొకటి లేదు.

ప్రేమతత్త్వమనేది చాలా గొప్పది. అలాంటి దానిని మనము యీనాడు సులభంగా వదలిపెట్టేస్తున్నాము. కానీ, ప్రేమ అంటే ప్రేమించటమని చెబుతున్నాము. అదికాదు ప్రేమ. నీయందున్న ప్రేమ, ఎదుటి వ్యక్తియందున్న ప్రేమ రండింటిని యేకము చేసేదే నిజమైన ప్రేమ. ఈ రెండింటి ఏకత్వమే నిజమైన ప్రేమత్త్వము. ప్రేమ, ప్రేమ అని మనమందరమూ పలుకుతూనే ఉన్నాము. కానీ, ప్రేమకు ఎట్టి రూపమున్నది, ఎట్టి గుణమున్నది, ఏవిధముగా ఉపయోగించు కోవాలి? ప్రేమ ఎవ్వరినీ బాధించదు. ఎంతకాలము నీవు ఉంచుకున్నప్పటికీ నీకు సహాయము చేయునుగానీ ఎవ్వరినీ బాధించదు. ప్రేమ ఎప్పుడూ సహాయము చేసేదే. అది యిట్టిదని చెప్పి నప్పుడు దాన ఇఉపయోగము పాడైపోతుంది. కనుక, ప్రేమను ప్రధానమైన ఆస్తిగా తీసుకోవాలి. ఇంతకంటె మించిన ప్రోపరిటీ ఈ ప్రపంచములో ఎక్కడా కానరాదు. భగవంతుడు అందించిన ప్రేమ అనే ప్రోపరిటీ ఎంత ఉపయోగపెట్టుకున్నా తక్కువ కాదు. భగవంతుడు యిచ్చిన ప్రేమను మనము యింద్రియముల ద్వారా పాడుచేసుకుంటున్నామేగానీ దాని పవిత్రత అందించటం లేదు. భగవంతుడిచ్చిన ప్రేమను సద్వినియోగం చేసుకోవాలి. హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్. హెల్ప్ చేస్తూ రావాలి. దీనికి మించిన దానధర్మములు మరొటి లేవు.

ప్రేమస్వరూపులారా! ప్రేమ ప్రతి ఒక్కరికీ భద్రమై శాశ్వతముగా నిల్చేటువంటిది. కాని, అట్టి ప్రేమను ఒక చెర్లాటగా ఆడుకుంటూ, ఎగరవేసిన కట్టవలె దానిని తిప్పుతున్నాము. మనము ఈ ప్రేమతత్త్వాన్ని భద్రంగా ఉపయోగించుకోవాలి. పరమాత్ముడిచ్చిన ప్రేమతత్త్వము ఎట్టి కొలతలు వేసినప్పటికీ అది తగ్గదు. ఇట్టి ప్రేమను సరైన విధముగా అర్థము చేసుకోలేకపోచున్నాము. ప్రేమ ప్రతి ప్రాణికి ప్రాణ సమానమే. ఇట్టి ప్రేమతత్త్వాన్ని అర్థము చేసుకోవాలంటే ప్రేమలోమే మునగాలి. ప్రేమలో మునిగినప్పుడే ప్రేమతత్త్వము మనకు అర్థమవుతుందిగానీ ప్రేమకు పైపైన ఉంటే ప్రేమతత్త్వము యేమాత్రము అర్థము కాదు. ఈనాటి ప్రపంచప్రేమ అంతా మనము చవి చూచి వదలిపెట్టినది. అన్నింటిని కూడినది యిది. ప్రేమమయుండు శ్రీధరుడు, ప్రేమయే అతని ప్రోపరిటీ. ఈ దైవము యొక్క ప్రోపరిటీని యెలా రక్షించాలి అనే విధానాన్ని గుర్తించాలి. ప్రేమే దైవము, దైవమే ప్రేమ. కనుక, ఎట్లా విభాగము చేసేందుకు వీలవుతుంది? లివ్ ఇన్ లవ్. అప్పుడే దాని అర్థము మనము పూర్తి గుర్తించిన వారమౌతాము. ప్రేమతత్త్వము పలుకుట చాలా సులభము. కానీ, అర్థము చేసుకొనుట చాలా కష్టము. కనుక, మీరు ప్రేమను గుర్తించుకోటానికి ప్రయత్నం చేయండి. నీ ప్రేమను నీవు అర్థం చేసుకుంటే యితరులయొక్క ప్రేమను అర్థం చేసుకుంటావు. మొట్టమొదట నీ ప్రేమను నీవు గుర్తించటానికి ప్రయత్నించు. తన ప్రేమ తన చుట్టూ, తన ప్రక్కన, ఎక్కడ చూచినా ఉన్నది ప్రేమయే. ఈ ప్రేమను తెలుసుకుంటే మనమే ప్రేమస్వరూపులమైపోతాము.

(2005 ఏప్రియల్ 9వ తేదీ సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)